ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 14-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశ భద్రతకు అత్యవసరమైన ఆయుధాల సాంకేతిక స్వావలంబనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు.
- భారత రాజ్యాంగం అత్యంత సమగ్రమైన ప్రజాస్వామ్య శాసనాలలో ఒకటని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.
- చట్ట సభల్లో మహిళలకు ప్రాతినిధ్యాన్ని వీలైనంత త్వరగా కల్పించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = =

గుజరాత్ లో పర్యటిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గాంధీనగర్ లోని రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 593 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రధానం చేశారు. అనంతరం స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ... రాబోయే కాలంలో భద్రతా పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుందన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు మనకు డిజిటల్ అరెస్ట్, సైబర్ క్రైమ్, ఫిషింగ్ దాడులు వంటి పదాల గురించి తెలియదని కానీ నేడు అవి మన ముందు ప్రధాన ముప్పులుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లో, రాష్ట్రీయ రక్షా విశ్వవిద్యాలయం వంటి సంస్థల ప్రాముఖ్యత మరింత పెరుగుతోందన్నారు. దేశ బలం కేవలం సైనిక సిబ్బంది, భద్రతా దళాల ధైర్యసాహసాలపైనే కాకుండా భద్రతకు అత్యవసరమైన ఆయుధాల సాంకేతిక స్వావలంబనపై కూడా ఆధారపడి ఉంటుందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా నిరంతరం కృషి చేస్తోందన్నారు. స్వదేశీ సామర్థ్యాలను, స్వావలంబనను పెంపొందించడం ద్వారా రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు ప్రారంభించారు. 213 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా నిర్మించిన ఈ ఎకనామిక్ కారిడార్‌ను 12 వేల కోట్ల రూపాయలకు పైగా వ్యయంతో అభివృద్ధి చేశారు. ఈ కారిడార్ ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల మీదుగా వెళుతుంది. దీనివలన ఢిల్లీ-డెహ్రాడూన్ ల మధ్య ప్రయాణ సమయం 6 గంటల నుండి సుమారు రెండున్నర గంటలకు తగ్గనుంది. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ కారిడార్ ప్రారంభోత్సవంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తూ... ఈ ఎకనామిక్ కారిడార్ ఉత్తరాఖండ్‌లో ఏడాది పొడవునా పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటూ ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందన్నారు. శీతాకాల పర్యాటకం, డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఉత్తరాఖండ్ గమ్యస్థానంగా మారుతోందన్నారు. 2023లో తాను కైలాష్ పర్వతాన్ని సందర్శించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. గతంలో శీతాకాలంలో కైలాష్ పర్వతాన్ని కేవలం కొన్ని వందల మంది మాత్రమే సందర్శించేవారని, అయితే 2025 నాటికి 40 వేల మందికి పైగా యాత్రికులు ఆ పర్వతాన్ని సందర్శించారని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

చట్టసభల్లో స్త్రీలకు రిజర్వేషన్లు కల్పించే చొరవను దేశవ్యాప్తంగా మహిళందరూ ప్రశంసిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. దశాబ్దాలుగా నిలిచిపోయిన ఈ అంశాన్ని అమలు చేయడంలో ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని పునరుద్ఘాటిస్తూ... భారత నారీశక్తికి అంకితం చేస్తూ రాసిన లేఖను ఆయన ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు. 2029 లోక్ సభ, విధానసభ ఎన్నికల నుంచే మహిళలకు రిజర్వేషన్లను అందించే నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా ఉన్న మాతృమూర్తులు, సోదరీమణులు, కుమార్తెలు స్వాగతిస్తున్నారని తెలిపారు. భారత నారీశక్తికి అంకితం చేసిన ఈ లేఖలో, దశాబ్దాల నాటి ఆకాంక్షను వీలైనంత త్వరగా సాకారం చేయడం గురించి తన ఆలోచనలను దేశ ప్రజలతో పంచుకుంటున్నానని పేర్కొంటూ.. విధాన రూపకల్పనలో మహిళల భాగస్వామ్యం వికసిత భారత్ దిశగా సాగే ప్రయాణాన్ని బలోపేతం చేస్తుందన్నారు. నారీశక్తి వందన అధినియమ్‌కు సంబంధించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణపై చర్చించడానికి మరో రెండు రోజుల్లో పార్లమెంటు సమావేశమవుతుందని తెలిపారు. ఈ చట్టం సభలో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విధానసభలలో మహిళలకు ప్రాతినిధ్యాన్ని వీలైనంత త్వరగా కల్పించేందుకు అందరూ ఏకతాటిపైకి రావాలని నరేంద్రమోదీ కోరారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

బీహార్‌లో బీజేపీ శాసనసభాపక్ష నాయకుడిగా భారతీయ జనతా పార్టీకి చెందిన సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యారు. పాట్నాలో ఈరోజు జరిగిన బీజేపీ శాసనసభాపక్ష సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితులైన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్.. సామ్రాట్ చౌదరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని తెలిపారు. దీంతో ఆ రాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి అయ్యేందుకు సామ్రాట్ చౌదరికి మార్గం సుగమమైంది. ఇదిలా ఉండగా, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఈరోజు తన పదవికి రాజీనామా చేశారు. గవర్నర్ సయ్యద్ అత్ హస్నైన్‌కు రాజీనామాను సమర్పించి తన మంత్రివర్గాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. రాజీనామాను ఆమోదించిన గవర్నర్, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆయనను తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత రాజ్యాంగం అత్యంత సమగ్రమైన ప్రజాస్వామ్య శాసనాలలో ఒకటని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ నిర్వహించిన “జాతి నిర్మాతగా డాక్టర్ అంబేద్కర్- వికసిత్ భారత్ వైపు మార్గాలు” అనే అంశంపై ఉపరాష్ట్రపతి ఈరోజు కీలక ఉపన్యాసం చేశారు. రాజ్యాంగ ముసాయిదా రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పోషించిన పాత్రను ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, విస్తృతమైన చర్చల ద్వారా ఆయన నాయకత్వంలో న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాది వేసుకున్నాయని చెప్పారు. భారత రాజ్యాంగాన్ని ప్రపంచంలోనే అత్యంత సమగ్రమైన ప్రజాస్వామ్య శాసనాలలో ఒకటిగా ఆయన అభివర్ణించారు. రాజ్యసభ ఛైర్మన్‌గా తన పాత్రను గురించి ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ప్రజాస్వామ్య సంస్థలు చర్చలు, నిర్మాణాత్మక సంప్రదింపుల ద్వారా పనిచేయాలని అన్నారు. పార్లమెంటరీ చర్చలు అంతరాయాలకు కాకుండా నిర్ణయాలకు దారితీయాలని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో "మేరా బూత్ సబ్సే మజ్బూత్" కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'నమో యాప్' ద్వారా ఆ రాష్ట్రానికి చెందిన బీజేపీ కార్యకర్తలతో ఈ సాయంత్రం సంభాషించారు. కార్యకర్తలు బూత్ లెవెల్లో సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. మహిళలు, యువత, రైతుల కోసం తమ పార్టీ మేనిఫెస్టోలో చేసిన హామీలను ఓటర్లకు స్పష్టంగా వివరించాలన్నారు. పార్టీ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ప్రతి బూత్‌లో యువత, మహిళలు, తొలిసారి ఓటు వేస్తున్న ఓటర్లతో సమావేశాలు నిర్వహించడం అత్యవసరమని కార్యకర్తలకు తెలిపారు. ఇక మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ కూడా ఈరోజు పలు ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా పింగ్లా, సబాంగ్లలో జరిగిన బహిరంగ సభలను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు.

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ దేశంలో గృహ వినియోగ ఎల్‌పిజి, పిఎన్‌జి మరియు సిఎన్‌జి సరఫరా నిరంతరాయంగా కొనసాగుతోందని ప్రభుత్వం తెలిపింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్,ఎల్‌పిజి నిల్వలు తగినంత అందుబాటులో ఉన్నాయని, ఏ ఎల్‌పిజి పంపిణీ కేంద్రంలోనూ కొరత ఏర్పడలేదని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ ఎల్‌పిజి బుకింగ్‌లు 98 శాతానికి పైగా పెరిగాయని మంత్రిత్వ శాఖ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. వలస కార్మికులకు మద్దతుగా గత నెల 23వ తేదీ నుంచి 14 లక్షల రూపాయలకు పైగా విలువైన 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి సిలిండర్లు అమ్ముడయ్యాయని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ క్రికెట్ లో భాగంగా చెన్నైలోని స్టేడియం వేదికగా.. కోలకతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన కోలకతా నైట్ రైడర్స్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =